క్లుప్తంగా

శ్వేతార్కలో సుదర్శన నర్సింహ హోమం



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు శుక్రవారం సుదర్శన నర్సింహ హోమం నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు హోమం జరిపించారు. కార్యక్రమంలో సాయికృష్ణ శర్మ, ఆనంద్ త్రిపాఠి, హర్షిత్ త్రిపాఠి, శివం శుక్ల, హరిస్వామి పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోండి

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కొనసాగుతున్న ఆధార్ సెంటర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. కొత్తగా ఆధార్ కార్డ్, కార్డులోని తప్పుల సవరణకు సరైన ఆధారాలతో వచ్చి సవరించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఆధార్ కేంద్రాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

వరికొయ్యలు కాల్చితే నష్టాలు తప్పవు



రాయపర్తి: వరికొయ్యలు కాల్చితే నష్టాలు తప్పవని ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు రావుల భాస్కర్‌రావు స్పష్టం చేశారు. మండల కేంద్ర శివారులోని పంట పొలాల్లోని వరికొయ్యలు కొందరు రైతులు కాల్చుతుండగా ఆయన అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. వరికొయ్యలను నేల సంపదగా అభివర్ణించారు. గడ్డిని కాల్చడం వల్ల భూమిలోని ఖనిజాలు, లవణాలు దెబ్బతిని నేల నిస్సారమవుతుందని తెలిపారు. రెండు, మూడు పంటలు తీశాక కొయ్యలను కాల్చితే పంటల దిగుబడి రాకుండా చవిటి నేలలుగా మారిపోతాయని చెప్పారు. లవణాల సాంద్రత ఎక్కువ పెరుగుతుందని, ఖనిజాలు లేని భూమిగా మారుతుందని వివరించారు. నేల, వాయు కాలుష్యం అవుతాయని, కొయ్యలు కాల్చిన భూముల్లో భవిష్యత్‌లో పంటలు పండవని తెలిపారు. క్యొలు కాల్చడానికి ప్రత్యామ్నాయంగా పంట పొలాల్లోనే నీరుపెట్టి కుళ్లిపోయేలా చేయాలని, తదనంతరం సూపర్‌ఫాస్ట్ చల్లితే కొయ్యలు త్వరగా కుళ్లిపోయి భూమికి జవసత్వాలు, సహజమైన ఎరువులు అందుతాయని చెప్పారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

తొర్రూరు రూరల్: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. మండలంలోని చెర్లపాలెంకు చెందిన సముద్రాల మల్లయ్య పాడి గేదెను గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రానికి తీసుకెళ్లాడు. మేత మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వాపోయాడు.

వార్షికోత్సవ పూజలు



గూడూరు : స్థానిక శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో శుక్రవారం త్రయోదశ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి నేటికి 13 వసంతాలు నిండుకొని, 14వ సంవత్సరంలోకి మొదలైంది. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి ఆశీష్‌పాండ్యే, సతీష్‌పాండ్యే ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించారు. 6 గంటల నుంచి కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన భక్తులచే సాయిబాబా విగ్రహానికి పాలాభిషేకం చేయించి, అర్చన పూజలు చేశారు. అనంతరం గొల్లగూడెంకు చెందిన చీర భిక్షపతి దంపతులు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు చెన్నబోయిన ఉప్పలయ్య, యాదగిరి, బాబూరావు, సాయిలు, శ్రీనివాస్‌గుప్త ఏర్పాట్లు చేశారు.

కొనుగోలు కేంద్రంలో నిలువు దోపిడీ

- తూకంలో మోసం చేశారని రైతుల ఆందోళన

రఘునాథపల్లి: ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంట.. విక్రయించాలంటే తమకు అడుగడుగునా మోసాలు జరుగుతున్నాయని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేసిన సంఘటన మండలంలోని కుసుంబాయితండాలో శుక్రవారం చోటు చేసుకుంది. కంచనపల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల కుసుంబాయితండా శివారులో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం నుంచి నిర్వాహకులు ఇప్పటికే 23 లారీల ధాన్యం కొనుగోలు చేసి జాఫర్‌గూడెం మిల్లుకు తరలించారు. ఒక్కో బస్తా 41 కేజీలతో తూకం వేస్తున్నారు. ఓ రైతు తన బరువును తూకం వేసుకోగా రెండు కేజీలు తక్కువ చూపుతుండటంతో అనుమానం వచ్చిన రైతులు మరో కాంటాను తీసుకవచ్చి 41 కేజీల బస్తాను తూకం వేయగా రెండు కిలోలు అదనంగా 43 కేజీలు రావడంతో వారి మోసం వెలుగు చూసింది. సమాచారం తెలుసుకున్న చుట్టు పక్కల గ్రామాల రైతులు తమను మోసం చేశారని కేంద్రం వద్దకు చేరుకొని నిర్వాహకులతో వాగ్వావాదానికి దిగారు. మిల్లు వద్దకు వెళ్లి విక్రయించిన అక్కడి బస్తాలను తూకం వేయగా 41 కేజీల బస్తాకు 2 కేజీల వ్యత్యాసం రావడంతో ఆందోళనకు దిగారు. లారీకి 10 క్వింటాళ్లకు పైగా అదనంగా దోచు కున్నారని మండిపడ్డారు. ఒక్కో లారీలో 41 కేజీల బస్తాలు 576 బస్తాలు పంపగా తూకంలో 595 బస్తాలు వచ్చాయన్నారు. అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో రైతులను నిలువు దోపిడి చేశారని మండిపడ్డారు. మిల్లు వద్ద అదనంగా దోచుకున్న ధాన్యానికి డబ్బులు చెల్లించాలని ఆందోళనకు దిగారు. ఆందోళన సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని శాంతింప జేసి ఆందోళన విరమింపజేశారు. ఈ విషయమై నిర్వాహకులను సంప్రదించగా స్పందించలేదు.



మిల్లు వద్ద ఆందోళన చేస్తున్న బాధిత రైతులు



తూకంలో 41 కేజీల బస్తా 43 కేజీలు చూపుతున్న కాంటా

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

బచ్చన్నపేట: ఆరోగ్య వంతమైన శిశువుకు జన్మనివ్వడానికి గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి సిద్దార్థరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను శుక్రవారం అందజేశారు. అనంతరం సిద్దార్థరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతులకు వివాహం అయినప్పటి నుంచి ప్రసూతి వరకు అండగా నిలుస్తుందన్నారు. వారికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి మందులు కూడా అందజేస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తుందన్నారు. గర్భిణులు ఆయా గ్రామాల ఆశవర్కర్ల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని, ప్రతీ నెల ప్రభుత్వ ఆస్పత్రిలోనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యులు రవళిస్టెల్లా, సృజన, సూపర్‌వైజర్లు అన్నాంబిక, జంగయ్య, సిబ్బంది శ్వేత, బొడ్డు శ్రీనివాస్, లత, లలిత ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్న వైద్యులు

బాధిత కుటుంబానికి పరామర్శ

చిల్పూరు: మండలంలోని పల్లగుట్టకు చెందిన శనిగరం కొంరయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు గ్రామానికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ బొట్టు మానస, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, ఉప సర్పంచ్ బత్తిని శ్రీనివాస్, జీడీ రమేష్, జీడీ జాన్, బొట్టు చేరాలు, జీడీ ఆనందం, పేరాల సుధాకర్, చొక్కయ్య, గుర్రపు యాదగిరి, ఆశోక్‌పాల్, కుంచాల సంపత్‌రాజు, శ్యాంసుందర్ రెడ్డి, కృష్ణ, నాగరాజు, మనోజ్, తరుణ్ ఉన్నారు.



నివాళులర్పిస్తున్న శ్రీధర్‌రావు

పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళి



చిల్పూరు: కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న రాజు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో కిష్టయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లిలో తెలంగాణ మలిదశ పోరాట తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతిని ముదిరాజ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యూత్‌కార్యదర్శి గోరంట్ల యాదగిరి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్ బూర్ల శంకర్ ముందుగా పోలీష్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పోలీస్ కిష్టయ్య ప్రాణ త్యాగాలు చేసి అమరుడయ్యాడని, ఆయన ఆశయాల సాధనకు తెలంగాణ యువత పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చెన్నూరి వెంకటేశ్వర్లు, పిట్టల అనీల్, శాగ సురేష్, కొండ వేణు, వెంకటేశ్వర్లు, యాదగిరి, శంకర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

చిల్పూరు: తెలంగాణ పోరాట తొలి అమరుడు, ముదిరాజ్ ముద్దుబిడ్డ పోలీస్ కిష్టయ్య సేవలు మరువలేనివని మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నీల రాజు అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాలలో శుక్రవారం కిష్టయ్య 14వ వర్ధంతి సందర్భంగా సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో శాగ నాగేశ్వర్, ఈర్ల రాజు, రవికుమార్, లక్ష్మీనారాయణ, శాగ నాగేష్, కుమార్, సోమయ్య, ఆటో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



బచ్చన్నపేట: అవగాహన కల్పిస్తున్న నర్సింగ్ విద్యార్థులు



కాజీపేట రూరల్: ర్యాలీలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ దయాకర్

బచ్చన్నపేట: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని మండల వైద్యాధికారి సిద్దార్థరెడ్డి అన్నారు. శుక్రవారం ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఏయిడ్స్‌పై అవగాహన కల్పించారు. అలాగే వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, నర్సింగ్ కోర్సు విద్యార్థులు పాల్గొన్నారు.

కాజీపేట అర్బన్: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల వరంగల్ వెస్ట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.దయాకర్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హంటర్ రోడ్డులోని డిగ్రీ కళాశాలలోని విద్యార్థినులతో కలిసి ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దయాకర్ మాట్లాడుతూ అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యమని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వేముల రమ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాధిక, అధ్యాపకులు గీత, శైలజ, దీప్తి పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ

హసన్‌పర్తి: ఎయిడ్స్ డేను పురస్కరించుకుని ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీని హసన్‌పర్తిలోని తెలంగాణ బాలికల గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థినులు నిర్వహించారు. కళాశాలల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతి మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని వివరించారు. వ్యాధి వ్యాప్తి, నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు: ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయమని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.వనజ అన్నారు. ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం డివిజన్ కేంద్రంలో పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్‌పై అవగాహన ఉంటే వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిని, రేణుకాదేవి, స్నేహలత, ప్రవళిక, పావని, సుమశ్రీ పాల్గొన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

కమలాపూర్: ప్రపంచం నుంచి ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని ఎంజేపీ ప్రిన్సిపాల్ ఓదెల మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రెడ్ రిబ్బన్ ఆకృతిలో ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధిన పడకుండా ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవి, డీడబ్ల్యూ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తొర్రూరు: ర్యాలీ తీస్తున్న గురుకుల విద్యార్థులు



హసన్‌పర్తి: ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు



రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మడికొండ: శ్రీరాముడి జన్మనక్షత్రం పునర్వసు నక్షత్రం సందర్భంగా మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంపై ఉన్న సీతారామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం విశేష పంచామృతాలతో అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో శ్రీరామ మూలమంత్ర హోమం చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణధికారి శేషుభారతి, అర్చకులు పరాశరం విష్ణువర్ధనచార్యులు, రాగిచేడు అభిలాష్‌శర్మ, పారుపల్లి సత్యనారాయణశర్మ, సిబ్బంది రామకృష్ణ, శ్రీదేవి, భాస్కర్, భక్తులు వెంకటేశ్వర్లు, వెంకన్న, శంకర్ పాల్గొన్నారు.

రేపు సామూహిక సత్యనారాయణ వ్రతాలు

వరంగల్: ములుగురోడ్డు సమీపంలోని సప్త గురుధామంలో ఈనెల 3వ తేదీన ఉదయం 8గంటల నుంచి మహాగణపతి హోమం, సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ తెలిపారు. గురుధామంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామూహిక వత్రాల్లో పాల్గొనే వారు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని చెప్పారు. పూజా ద్రవ్యాల్లో ఇంట్లో పూసిన పూలు, పండ్లు మాత్రమే తీసుకురావాలని, మిగిలిన ద్రవ్యాలు ఆవు నెయ్యి, ఆవు పాలు, ఆవు పెరుగు, వ్రతానికి సంబంధించిన పూజా ద్రవ్యాలను ఉచితంగా సమకూరుస్తామని వివరించారు. ఈ కార్యక్రమానికి దేశ, విదేశాల నుంచి అనేక మంది శివానందమూర్తి గురువు భక్తులు హాజరు కానున్నారని చెప్పారు. మరో ట్రస్టీ బండారు సాయి నారాయణ మాట్లాడుతూ భక్తులు ఇంట్లో పూజ చేసుకుంటే అది ఒక వ్రత ఫలితమే వస్తుందని, సామూహికంగా కలిసి వ్రతం లేదా పూజ చేసుకుంటే అన్ని ఫలాలు వస్తాయన్నారు. అనంతరం వ్రతానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

మద్యం షాపు తొలగించాలని ఆందోళన



మద్యం దుకాణం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కమలాపూర్: మండలంలోని అంబాలలో గల మద్యం దుకాణాన్ని వెంటనే అక్కడి నుంచి తొలగించాలని గ్రామస్తులు, కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మద్యం షాపు ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబాల ప్రధాన రహదారి సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం సేవించిన మందుబాబులు రోడ్లపై మల, మూత్ర విసర్జన చేస్తుండటంతో స్థానికంగా నివసించే మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధాన రహదారి పక్కనే మద్యం దుకాణం ఉన్న కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కొందరు మద్యం మత్తులో మహిళలపై అఘాయిత్యాలకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మద్యం దుకాణాన్ని ఎత్తి వేయాలని కోరుతూ ఆగస్టులో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని, స్పందించిన కలెక్టర్ మద్యం దుకాణాన్ని అక్కడి నుంచి తీసేస్తామని చెప్పారని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కానీ ఇప్పటి వరకు తొలగించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మద్యం దుకాణాన్ని వెంటనే మరోచోటకు తరలించాలని కోరారు.

శతాధిక వృద్ధురాలి మృతి

చెన్నారావుపేట: మండలంలోని బోజెర్వు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు షేక్ అఫ్జల్ బీ (105) శుక్రవారం మృతి చెందింది. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె పరిస్థితి విషమించి మృతి చెందింది. ఆమె మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన పలువురు ఆమె మృతదేహానికి నివాళులు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలికి కూతురు యాకూబీ, నుమడు షేక్ హాజీపాషా, మనుమరాళ్లు ఉన్నారు.



అఫ్జల్ బీ (ఫైల్)

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: ఈనెల 28న రోడ్డు ప్రమాదానికి గురైన మండలంలోని తాటికొండకు చెందిన దొమ్మాట గట్టయ్య(56) హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. సీఐ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాటికొండకు చెందిన గట్టయ్య గీత కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 28న కల్లు గీసేందుకు టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై తాటికొండ నుంచి జిట్టిగూడెంవైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో జిట్టిగూడెం నుంచి హీరోహోండా స్పెండర్ బైక్‌పై వస్తున్న సునావత్ రాజ్‌కుమార్ టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గట్టయ్య తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

శాయంపేట : మండలంలోని పత్తిపాక రవీంద్ర భారతి పాఠశాలలో 2009–10 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం వారికి విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. పాఠశాల డైరెక్టర్ నకిరబోయిన కుమారస్వామి, ఉపాధ్యాయులు శేషాద్రి మల్లయ్య, వీరగాని సత్యం, పసునూటి రమణయ్య, ఐరబోయిన భిక్షపతి, బండ నిరంజన్‌రెడ్డి, వైద్యుడు తిరుపతిరెడ్డి, కందగట్ల హరికృష్ణ, ఎర్ర రాకేష్‌రెడ్డి, ప్రకాష్, విద్యార్థులు శ్రీకాంత్, ప్రశాంత్, రమేష్, శృతి, దివ్య, గీత, మహేష్, సింధుజ, రజిత, రాజు, కిరణ్, శ్వేత, వెంకటేష్, రజనీకర్, సరిత, సాయిరాం, చిరంజీవి పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నెక్కొండ: మండలంలోని గొట్లకొండకు చెందిన మాలోతు స్వామి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి స్వామి చిన్ననాటి మిత్రులు శుక్రవారం రూ.50 వేల సాయం అందించారు. స్వామితోపాటు మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 2004–05 విద్యాసవత్సరంలో చదువుకున్న మిత్రులు తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం స్వామి భార్య పద్మకు రూ.50 వేలు అందజేశారు. కార్యక్రమంలో స్వామి మిత్రులు ప్రసాద్, రఘుమోహన్, శ్రీను, రమేష్, రాజశేఖర్, రవి, రంజిత్, అక్బార్, అశోక్, వెంకటేష్, సృజన్, శ్రీకాంత్, రమేష్, రాంచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

దోర్నకల్: మండలంలోని తహసీల్దారు బంజర గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్(ఐకేపీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్నేహ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ సిబ్బంది ప్రారంభించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఐకేపీ సిబ్బంది, రైతులు కొనుగోలు కేంద్రాన్ని ప్రాంరంభించారు. ఈ కార్యక్రమంలో సీసీ రాధ, వీఏఓ అధ్యక్షురాలు వీరలక్ష్మి, కేంద్రం ఇన్‌చార్జ్ నల్లబెల్లి హరీశ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

అనసూర్య ఆశయ సాధనకు పోరాడాలి

కేసముద్రం : పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి బొమ్మనబోయిన అనసూర్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పోరాడాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు మండల వెంకన్న అన్నారు. శుక్రవారం మండలంలోని ధన్నసరిలో అనసూర్య సంతాప సభలో ఆయన మాట్లాడుతూ అనసూర్య ప్రజాసమస్యలు, మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేసిన నాయకురాలని కొనియాడారు. కళావతి లింగ్యా, గొని ఐలయ్య, బండారి ఐలయ్య, మైస శ్రీనివాస్, తిరుపతమ్మ, జానకీ, లక్ష్మక్క పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో..

మండల కేంద్రంలోని ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో అనసూర్య సంతాప సభలో ఐఎఫ్‌టీయు రాష్ట్ర సహాయ కార్యదర్శి శివారపు శ్రీధర్ మాట్లాడుతూ ఆమె పోరాటాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొట్టం అంజయ్య, వెంకన్న, బండి రాజు, మంజుల పాల్గొన్నారు.